సాక్షి ఒడిశా

శనివారం ౹ 8 ౹ ఫిబ్రవరి ౹ 2025



శ్రీ మందిరం ఆదాయం

నగదు	రూ. 6,75,562
బంగారం	6 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
వెండి	3 గ్రాముల 300 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



బ్లాక్‌మార్కెట్‌లో టికెట్లు

వన్‌డే మ్యాచ్ టికెట్లు బ్లాక్ మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. 9న కటక్‌లో వన్‌డే జరగనుంది. - 8లో



ఉచిత వైద్యశిబిరం

జయపురం బార్ అసోసియేషన్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. 155 మందిని పరీక్షించారు. - 8లో

న్యూస్‌రీల్

అడవులలో నిప్పు పెట్టవద్దు



మోహన బ్లాక్ రాయిపంక వద్ద అటవీ శాఖ సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మోహన బ్లాక్ అటవీ రేంజ్ పరిధిలోని మోహన, అడవ, రాయిపంక, బిరికోట్ అడవులలో నిప్పు పెట్టవద్దని అటవీ శాఖ సిబ్బంది బైక్ ర్యాలీ గ్రామగ్రామాన చేపట్టారు. ఈ బైక్ ర్యాలీని మోహన అటవీ రేంజ్ అధికారి లక్ష్మీ ప్రసాద్ బిశోయి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. పోడు వ్యవసాయం కోసం అడవులను గిరిజనులు గజపతి జిల్లాలో తగుల బెడుతుంటారు. దీని వల్ల పర్యావరణానికి ముప్పు కలుగుతుందని, వన్య ప్రాణులకు హాని జరుగుతుందని మోహన అటవీ రేంజ్ అధికారి లక్ష్మీ ప్రసాద్ బిశోయి అన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న నళిని

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని నవజీవన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేదలైన 40 మంది వృద్ధ ఆదివాసీ మహిళలకు నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. బియ్యం, కంది పప్పు, ఉప్పు, నూనె, బంగాళదుంపలు వంటి పది రకాల నిత్యావసర వస్తువులను అందజేసినట్లు ట్రస్టు నిర్వాహకురాలు ఎం.నళిని తెలియజేశారు. ప్రతినెలా ఈ తరహా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

చోరీకి గురైన స్కూటీ నదిలో లభ్యం



నదిలో స్వాధీనం చేసుకున్న స్కూటీ

రాయగడ: స్థానిక పీహెచ్‌డీ కాళీమాత మందిరం సమీపంలో జంఝావతి నదిలో ఒక స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం న్యూకాలనీలో ఒక వ్యాపారి నుంచి స్కూటీతో సహా రూ.5 లక్షలు దొంగలించిన ఘటనకు సంబంధించి దుండగుడు స్కూటీని నదిలో పడివేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. టి.గౌరీ శంకరరావు తన వ్యాపార లావాదేవీల్లో భాగంగా రూ.5 లక్షలు స్కూటీ డిక్కీలో పెట్టి, న్యూకాలనీలోని ఒక దుకాణం వద్ద సామాన్లు ఖరీదు చేశాడు. అదే సమయంలో గుర్తు తెలియని దుండగుడు స్కూటీతో సహా రూ.5 లక్షలు దొంగిలించిన సంగతి తెలిసిందే. అయితే దీనికి సంబంధించి స్థానిక జంఝావతి నదిలో కొంతమంది స్నానాలు చేస్తున్న సమయంలో నది మధ్యలో స్కూటీ కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఐఐసీ కేకేబీకే కుహరో, ఇతర పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. స్కూటీ తాళాలు కూడా స్కూటీకే వదిలేసిన దుండగుడు, డిక్కీలో నగదును మాత్రం తీసుకెళ్లిపోయాడు. స్వాధీనం చేసుకున్న స్కూటీని పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

బడికి తాళం



పాఠశాలకు తాళాలు వేసి తమ సమస్యలను వెల్లడిస్తున్న విద్యార్థులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి బొడిగాం గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు, గ్రామస్తులు కలసి తాళాలు వేశారు. పాఠశాలలో ఎంతో కాలంగా నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా.. ఫలితం లేకపోవడంతో మరో మార్గం లేక గురువారం బడికి తాళాలు వేశారు. పాఠశాలకు సక్రమంగా సకాలంలో ఉపాధ్యాయులు రావటం లేదని, బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో కొత్తవారిని నియమించటం లేదని తమ చదువులు సజావుగా సాగడం లేదని విద్యార్థులు ఆరోపించారు. పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యా విభాగ అధికారులకు, జిల్లా అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం ఉండడం లేదన్నారు. అందుకే మరో మార్గం లేక పాఠశాలకు తాళాలు వేసినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

- ఎట్టకేలకు పూర్తయిన హైలెవెల్ వంతెన
- రాకపోకలకు మార్గం సుగమం
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

వారధి.. పర్యాటకానికి సారథి



జంఝావతి నదిపై నిర్మించిన హై లెవెల్ వంతెన



చురుగ్గా కొనసాగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు

రాయగడ: స్థానిక మజ్జి గౌరి మందిరానికి సమీపంలో గల జంఝావతి నదిపై నిర్మితమవుతున్న హైలెవెల్ వంతెన పనులు దాదాపు పూర్తయ్యాయి. రాయగడ మీదుగా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణలతో పాటు ఇటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల రాకపోకలకు మార్గం సుగమమైంది. అయితే వంతెన పనులు పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదు. త్వరలో పనులు పూర్తి చేసి ప్రారంభానికి సన్నద్ధమవుతున్నారు. ఇదివరకు జంఝావతి నదిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనన్న భయాందోళనలను వాహన చోదకులు వ్యక్తం చేస్తుండేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జంఝావతి నదిపై హైలెవెల్ వంతెనను నిర్మించేందుకు ప్రతిపాదించింది. ఈ క్రమంలో సుమారు రూ.23.53 కోట్ల వ్యయంతో వంతెనను నిర్మించేందుకు ఆర్ అండ్ బి శాఖకు అప్పగించింది. దీంతో 2016-17 వ సంవత్సరంలో వంతెన నిర్మాణం పనులకు ఒప్పందం కుదరగా 2017, ఏప్రిల్ 15వ తేదీన పనులకు శ్రీకారం చుట్టారు. ఒప్పందం ప్రకారం గత ఏడాది అక్టోబరు 30 వ తేదీకి పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ పనుల్లో జాప్యం జరుగుతోంది. వంతెన నిర్మాణంలో ఆధునిక పరిజ్ఞానం వినియోగించారు.

వంతెన పనులను సందర్శించిన ఆర్ అండ్ బీ శాఖ చీఫ్ ఇంజినీర్ దుర్గా ప్రసాద్ బెహర ఇటీవల పర్యటించి పరిశీలించారు. వంతెన పనులు సంతృప్తి కరంగా ఉండటంతో త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే వంతెన పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్డు పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉందని అన్నారు. కొండలను దొలిచి రహదారిని నిర్మిస్తుండటంతో జాప్యం జరుగుతోందని వివరించారు. వంతెనపై హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. సెల్ఫీలు తీసుకుని ప్రాణాలు మీదకు తెచ్చుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో వంతెన పై ప్రమాదాల నివారణకు సంబంధించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మజ్జిగౌరి మందిరానికి వచ్చే భక్తులు ఇక్కడకు వచ్చి సెల్ఫీలు తీసుకునే అవకాశం ఉన్నందున ఇలాంటి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికి ఈ వంతెన నిర్మాణానికి సంబంధించి రూ.19.47 కోట్లు ఖర్చు జరిగినట్లు సమాచారం.



పరిశీలిస్తున్న ఆర్ అండ్ డి శాఖ చీఫ్ ఇంజినీర్ దుర్గా ప్రసాద్ బెహరా

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన ట్రాక్టర్



మృతదేహాలను వెలికితీస్తున్న అగ్నిమాపక సిబ్బంది



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- ఇద్దరు మృతి
- మరో నలుగురికి గాయాలు

రాయగడ: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రగాయాలకు గురైన ఘటన జిల్లాలోని గుణుపూర్ సమితి పరిధి గులుముండ గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మృతి చెందినవారు సమితి పరిధి ఒంపర గ్రామానికి చెందిన చైతన్య సబర్ (32), అతని భార్య మమిత సబర్ (28)లుగా పోలీసులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గుణుపూర్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం పర్లాకిమిడి రిఫర్ చేశారు.

ఇటుకల లోడుతో వెళ్తుండగా...

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం గులుముండ సమీపంలోని ఇటుకల బట్టీ వద్ద ఇటుకలను ట్రాక్టర్‌లో లోడు చేసుకుని ఆరుగురు వ్యక్తులు గుణుపూర్ వస్తున్న సమయంలో గులుముండ వద్ద ట్రాక్టరు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇటుకల కింద ఉండిపోయిన చైతన్య, మమితలు ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు తీవ్రగాయాలకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం కోసం గుణుపూర్ ఆస్పత్రికి తరలించారు. ట్రాక్టరులో ప్రయాణించే వారందరూ గుణుపూర్ సమితి ఒంపర గ్రామానికి చెందిన వారుగా సమాచారం. అయితే ఈ ప్రమాదంలో గాయాలుపాలైనవారి వివరాలు తెలియాల్సి ఉంది.

12న అఖిలపక్ష సమావేశం

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని అఖిల పక్ష సమావేశం జరగనుంది. ఈ నెల 13 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 12న శాసన సభ స్పీకర్ సురమా పాఢి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు అఖిల పక్ష సమావేశం జరగనుంది. ఈ నెల 17న శాసన సభలో ప్రవేశపెట్టనున్న 2025-26 ఆర్థిక సంవత్సరపు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెడతారు. రాష్ట్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వరుసగా రెండోసారి సమర్పించనున్న బడ్జెట్ ఇది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 2.65 లక్షల కోట్ల తొలి బడ్జెట్‌ను గత ఏడాది జూలై 25న ముఖ్యమంత్రి సమర్పించారు. ప్రతి సంవత్సరం బడ్జెట్ పరిమాణం పెరుగుతుంది. కొత్త ఆర్థిక సంవత్సరం 2025-26 బడ్జెటు పరిమాణం రూ. 2.75 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా. కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో మంజూరైన కేటాయింపుల నుంచి నిధుల్ని ఈ ఏడాది జనవరి నెల చివరి వరకు ఖర్చులు చేయడంలో కొన్ని శాఖలు వెనుకబడి ఉన్నాయి.

బీడీ ఆకుల గిడ్డంగిలో గంజాయి



బీడీ ఆకుల గిడ్డంగిలో పట్టుబడిన గంజాయి బస్తాలను మెజిస్ట్రేట్ సమక్షంలో సీజ్ చేసిన పోలీసులు



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు



ఖెందు లీఫ్ గిడ్డంగిలో శోధిస్తున్న పోలీసులు

జయపురం: ఒడిశా ఫారెస్టు డివిజన్ కార్పొరేషన్ ఖెంధూలీఫ్(బీడీ ఆకుల గిడ్డింగి) గిడ్డంగిలో పెద్ద ఉత్తున గంజాయి పట్టుబడినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. గురువారం సాయంత్రం పోలీసు అధికారి ఈశ్వర తండి డైరెక్షన్ ప్రకారం సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌కే బారిక్ పోలీసు సిబ్బందితో జయపురం సమితి ఎకంబా గ్రామ ప్రాంతంలో పెట్రోలింగ్ జరుపుతుండగా ఎకంబా గ్రామ సమీపంలో గల ఒడిశా ఫారెస్టు డివిజన్ కార్పొరేషన్ వారి ఖెందూ లీఫ్ గిడ్డంగిలో గంజాయి నిల్వ ఉన్నట్లు వారికి సమాచారం వచ్చింది. వెంటనే ఎస్ఐ బారిక్ తన సిబ్బందితో ఖెందూ లీఫ్ గిడ్డంగికి వెళ్లారు. అయితే వారు వెళ్లేసరికి గిడ్డంగి షట్టర్ మూసి ఉంది. అంతే కాకుండా షట్టర్‌కి తాళాలు కూడా వేయలేదు. వెంటనే వారు గిడ్డంగిని చుట్టుముట్టారు. షట్టర్ తెరిచి లోపలకు వెళ్లి చూడగా.. పెద్ద ఎత్తున గంజాయి బస్తాలు కనిపించాయి. వెంటనే ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌ను రప్పించి అతని సమక్షంలో గిడ్డంగిలో సీజ్ చేసిన గంజాయిని తూయించగా అవి 248 కేజీల 100 గ్రాములు ఉందని, గంజాయి నెట్ వెయిట్ 247 కేజీల 100 గ్రాములుందని పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. గంజాయిని సీజ్‌చేసి ఎన్‌డీపీఎస్ చట్టం నిబంధనల ప్రకారం అన్ని ఫార్మాలిటీస్ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

దివ్యాంగుల కోసం 'సుగమ్య యాత్ర'



సుగమ్య యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎస్ఎస్ఓ సంతోష్ నాయక్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో దివ్యాంగులకు ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్, మార్కెట్‌ల వద్ద రెయిలింగ్, త్రిచక్రవాహనాలు వెళ్లడానికి ర్యాంప్స్ వంటివి ఏర్పాటు చేయాలన్న చిరకాల డిమాండ్‌కు కేంద్ర,రాష్ట్ర సామాజిక సురక్ష శాఖల అధికారులు సముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గజపతి కలెక్టరేట్ నుంచి ఐదు కార్లలో సమర్థ్ దివ్యాంగుల పునరావాస కేంద్రం అధ్యక్షులు సంతోష్ మహారాణా, సబ్‌డివిజనల్ సామాజిక సురక్షా అధికారి ఉత్సర్‌గీతా బోడోరయితో, తదితర సభ్య బృందం యాక్సిసబుల్ ఇండియా ప్రచారం సుగమ్య యాత్రను జిల్లా సామాజిక సురక్షా శాఖ అధికారి సంతోష్ కుమార్ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. దాదాపు 15 మంది సభ్యులు, పట్టణంలో 'సుగమ్య యాత్ర'ను శుక్రవారం నాడు చేపట్టారు. వీరు పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి, ప్రైవేటు క్లినిక్‌లు, నేత్రాలయాలు, షాపింగ్ మాల్స్, సినిమా హాల్స్ తదితర కేంద్రాలను పరిశీలిస్తారు. ఈ సందర్భంగా డీఎస్ఎస్ఓ సంతోష్ నాయక్ సాక్షితో మాట్లాడుతూ, ఈ సుగమ్య యాత్ర ద్వారా దివ్యాంగులకు ప్రతి చోటా వారికి సౌచాలయాలు, ర్యాంప్స్ నిర్మాణం, రెయిలింగ్ ఉండాలన్న నియమం కేంద్ర ప్రభుత్వం చట్టం ద్వారా కల్పించిందని, అందువల్ల వీటి ఆవశ్యకత దివ్యాంగులకు ఉందని అన్నారు. ఈ సుగమ్య యాత్రలో రాష్ట్ర దివ్యాంగుల పునరావాస కేంద్రం అధ్యక్షులు నిరంజన్ బెహారా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



చిత్రగుడ గ్రామంలో అటవీ అగ్నిప్రమాదాలపై సచేతన శిబిరం

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ అటవీ విభాగ రేంజ్ పరిధిలో చిత్రగుడ గ్రామంలో ఒడిశా ప్రభుత్వ అటవీ పర్యావరణం, జల వాయు పరివర్తన విభాగం శుక్రవారం అడవులలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన శిబిరం నిర్వహించారు. అడవుల్లో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అందువల్ల అడవులు నష్టపోవటంతో పాటు పర్యావరణం కలుషితం అవుతోందని కొట్‌పాడ్ అటవీ రేంజర్ బిద్యుత్ బిశ్వాల్ వెల్లడించారు. సహజంగా అడవులలో ఎండా కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరగటం పరిపాటని అన్నారు. కొట్‌పాడ్ రేంజ్‌లో కూడా అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవుల్లో అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అడవిలో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే అటవీ శాఖాధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో గిర్ల పంచాయతీ సర్పంచ్ జగమోహణ మరిఖ, వెటర్నరీ అధికారి సత్యబ్రత సామంత రాయ్, ప్రభాకర నాయిక్,చైతన్య తండి, సుదీప్తి నాయిక్,సుశాంత మహాపాత్రో, జయంతి సాహులతో పాటు చిత్రగుడ, సింధిగాం, టిమర్‌గుడ, బైరాగి పాదర్, లామగుడ, హరదలి గ్రామాల కమిటీల సభ్యులు, వందలాదిమంది గ్రామస్తులు పాల్గొన్నారు.

విజిలెన్స్ వలలో భూగర్భజల ప్రాజెక్టు అధికారి



సంతూన్ మహాపాత్రో



మోహన్ మండాల్ (వ్యవసాయ సహాయక ఇంజనీర్)



అమియా కాంత్ సాహు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా భూగర్భ జల (సోయిల్ కన్జర్వేషన్) విభాగ ప్రాజెక్టు డైరెక్టర్ సంతూన్ కుమార్‌పై విజిలెన్స్ దాడులు జరిగాయి. పూర్తి సోదాలు అనంతరం శుక్రవారం సంతూన మహాపాత్రోతో పాటు ఆయన కార్యాలయ సిబ్బంది మోహన్ మండాళ్ (సహాయక వ్యవసాయ ఇంజనీర్), విశ్వజిత్ మండాల్ (డేటా ఎంట్రీ ఆపరేటర్), అమియా కాంత్ సాహు (కాంట్రాక్ట్ ఉద్యోగి)లను అరెస్టు చేశారు. సంతూన్ వద్ద విలాసవంతమైన ఇల్లు, 4 విలువైన భూములు, 422 గ్రాముల బంగారం, బ్యాంకులో రూ.91 లక్షలు నగదు, ఇంటి వద్ద రూ.2 కోట్ల నగదు లభించింది. అలాగే సంతూన్ భార్యపై కొరాపుట్‌లో కేసు నమోదైంది.

• వ్యాపారిని ఢీకొన్న మో బస్సు



ఘటనా స్థలంలో ఉద్రిక్తత

భువనేశ్వర్: మో బస్సు ఢీకొన్న ప్రమాదంలో వీధి వ్యాపారి గాయపడ్డాడు. కటక్ ఛత్ర బజార్ నుంచి తిరిగి వస్తుండగా ఖాన్ నగర్ మల్లాచండియా ట్రాఫిక్ కూడలిలో శుక్రవారం ఉదయం ఈ సంఘటన చోటు చేసుకుంది. వ్యాపారి వికాష్ స్వంయి గాయపడడంతో మోపెడ్ దెబ్బ తింది. స్థానికులు ఆగ్రహించడంతో ఘటనా స్థలంలో ఉద్రిక్తత నెలకొంది. స్థానిక బదాంబాడి ఠాణా పోలీసులు ఈ ప్రాంతం సందర్శించి విచారణ చేపట్టారు.

పర్లాకిమిడి కలెక్టరేట్ ఘెరావ్



కలెక్టరేట్ వద్ద గజపతి జిల్లా గావ్ సాథీల మిళిత సంఘాల ఆందోళన



గజపతి జిల్లా గావ్ సాథీల మిళిత సంఘం ర్యాలీ



కలెక్టరేట్ వద్ద డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న గావ్ సాథీలు



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న గావ్ సాథీల మిళిత సంఘాలు

పర్లాకిమిడి:

గజపతి జిల్లాలో మహాత్మాగాంధీ గ్రామీణ స్వయం ఉపాధి, ఎన్.ఆర్.జి.ఏ. పథకాల కింద పనిచేస్తున్న గావ్ సాథీలు (మేట్స్) స్థానిక శ్రీజగన్నాథ మందిరం నుంచి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో ఆర్.ఉదయగిరి, గుమ్మా, రాయఘడ సమితిల నుంచి వేలాది మంది పాల్గొన్నారు. కలెక్టరేట్ వరకూ సాగిన ఈ ర్యాలీలో మహిళలు, గావ్ సాథీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా గావ్ సాథీ మిళిత క్రియానుష్ఠాన్ సంఘం అధ్యక్షులు పోంచు నాయక్ మాట్లాడుతూ, గత బీజేడీ ప్రభుత్వ హయాంలో అనేక పోరాటాలు చేసినా పట్టించుకోలేదని, బీజేపీ ప్రభుత్వం ఎన్నికల హామీలో గావ్ సాథీలకు గౌరవ వేతనం, ఏడాదికి 300 రోజుల ఉపాధి కల్పన, దినసరి కూలీ రూ. 352, గావ్ సాథీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు వంటి ప్రధాన సమస్యలతో వచ్చామని అన్నారు. గావ్ సాథీలు గత ఏడాదిన్నరగా పనులు లేక అనేక మంది పట్టణాలకు వలసపోయారని, రాయఘడ, ఆర్.ఉదయగిరి, గుమ్మా బ్లాక్‌లను వలసల మండలాలుగా గుర్తించాలని గావ్ సాథీ, మిళిత సంఘం కార్యదర్శి హాడియా భుయ్యాన్ అన్నారు. చివరకు జిల్లా ఎమర్జెన్సీ అధికారి ఆందోళన చేస్తున్న గావ్ సాథీల వద్దకు వచ్చి ముఖ్యమంత్రికి అడ్రస్ చేస్తూ రాసిన వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో గావ్ సాథీ మిళిత సంఘాలు ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

సోదరుడికి తలకొరివి పెట్టిన సోదరి



సుధాకర్‌కు తలకొరివి పెడుతున్న అక్క కృష్ణవేణి

నందిగాం : మండలంలోని హరిదాసుపురంలో తోడబుట్టిన సోదరుడికి సోదరి తలకొరివి పెట్టిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కణితి ఆనందరావు, రత్నాలు దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. అందరికీ వివాహలయ్యాయి. కుమారుడు సుధాకర్ భార్య విడాకులు తీసుకుంది. ఇటీవల సుధాకర్ తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తండ్రి ఆనందరావు మూడేళ్ల క్రితం మృతి చెందడం, తల్లి వృద్ధాప్యంతో బాధపడుతుండటంతో సోదరి కృష్ణవేణి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసింది.

కార్గో ఆదాయం పెరగాలి



హమాలీలతో మాట్లాడుతున్న అప్పలనాయుడు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ కార్గో ఆదాయాన్ని పెంచేందుకుఅధికారులు, సిబ్బంది, కలాసీలు సమన్వయంతో పనిచేయాలని విజయనగరం జోన్–1 డిప్యూటీ సీటీఎం (ఓసీ) బి.అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం కార్గో కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి, హమాలీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు క్యూఆర్ కోడ్ ద్వారా కూడా బుకింగ్స్ చేసుకోవచ్చని తెలిపారు. వాట్సాప్ ద్వారా టికెట్స్ బుక్ చేసుకోవచ్చని చెప్పారు. డోర్ డెలివరీ ద్వారా సరుకులను ఇంటికి వద్ద చేరుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ ఆర్.వి.రావు, ఇజాజ్, ఎస్ఎం ఎం.పి.రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం ఎంఈఓ మృతికి సంతాపం



జి.కృష్ణారావు(ఫైల్)

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్, అర్బన్ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న గువ్వాడ కృష్ణారావు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో మృతి చెందారు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. స్వగ్రామం నందిగాం మండలం సింగుపురం. 2001లో ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించిన ఈయన 2015లో మండల విద్యాశాఖాధికారిగా పదోన్నతి పొందారు. గతంలో ఆమదాలవలస, గార మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓగా వ్యవహరించారు. కృష్ణారావు మృతి పట్ల డీఈఓ తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, ఎంపీడీఓ బి.శైలజ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో జేసీబీ దగ్ధం



కాలిపోతున్న జేసీబీ

జి.సిగడాం: మండలంలోని బాతువ గ్రామంలో కలిగి ఢిల్లీశ్వరరావు చెందిన సుమారు రూ.50 లక్షల విలువైన జేసీబీ అగ్నికి ఆహుతైంది. పొలం పనులు చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న రాజాం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే యంత్రం కాలిపోయింది.

బారాబటిలో
భారత్, ఇంగ్లండ్ వన్డే మ్యాచ్



మే ఫెయిర్ హోటల్‌కు చేరిన టీమ్ ఇండియా జట్టు



బసకు చేరిన టీమ్ ఇంగ్లండ్ జట్టు





మే ఫెయిర్ హోటల్ ప్రాంగణంలో టీమ్ ఇండియా స్టార్ బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్, శుభమన్ గిల్‌కు సంప్రదాయ స్వాగతం

భువనేశ్వర్: కటక్ బారాబటి స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ వన్డే మ్యాచ్ నిర్వహణకు భారీ సన్నాహాలు చేస్తున్నారు. ఉభయ జట్ల క్రికెటర్లు శుక్రవారం సాయంత్రం నగరానికి చేరారు. వీరి బస కోసం స్థానిక మే ఫెయిర్ హోటలులో తారా స్థాయి సౌకర్యాలు కల్పించారు. మ్యాచ్ నిర్వహణ కోసం సకల ఏర్పాట్లు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం 50 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించనున్నారు. మ్యాచ్ పురస్కరించుకుని స్టేడియం లోపల తాగు నీటి సీసాలు నిషేధించినట్లు ప్రకటించారు. ఆదివారం జరిగే మ్యాచ్‌కు కమిషనరేట్ పోలీసులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు జంట నగరాల పోలీసు కమిషనరేటు తెలిపింది. అంతర్జాతీయ క్రికెటర్ల రాకపోకలు పురస్కరించుకుని స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం, వీరు బస చేసే హోటళ్లు, మ్యాచ్ జరిగే బారాబటి స్టేడియం ప్రాంగణంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

భారత్, ఇంగ్లాండ్ వన్డే మ్యాచ్ ఆటగాళ్లు ఒక ప్రైవేట్ విమానంలో స్థానిక బిజు పట్నాయక్ విమానాశ్రయం చేరారు. కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థ మధ్య వీరు బస చేసే హోటల్‌కు తీసుకెళ్లారు. మ్యాచ్ సమయంలో ప్రేక్షకులు నీటి సీసాలు స్టేడియంలోకి తీసుకెళ్లడానికి అనుమతించరని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఆటగాళ్లు బస చేసిన భువనేశ్వర్ ప్రాంతం హోటలు ప్రాంగణం నుంచి మ్యాచ్ జరిగే కటక్ బారాబటి స్టేడియం వరకు ప్రయాణించే సమయంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యకలాపాల్లో మొత్తం 50 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించినట్లు పోలీస్ కమిషనర్ ఎస్.దేవదత్ సింగ్ తెలిపారు.

టికెట్ల అమ్మకాల్లో అవకతవకలు

బారాబటి స్టేడియంలో జరగబోయే వన్డే మ్యాచ్ టిక్కెట్ల అమ్మకాల్లో భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణ. ఈ పరిస్థితి పట్ల సర్వత్రా విచారం వ్యక్తం అయింది. ఈసారి మ్యాచ్‌కు నామ మాత్రంగా 15,080 టిక్కెట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. దాదాపు 30,000 పాస్‌లు పంపిణీ చేశారు. దీంతో సాధారణ ప్రేక్షక వర్గానికి సముచితంగా టికెట్లు లభించలేదు. క్రికెట్ అభిమానుల్లో తీవ్ర నిరాశ వ్యక్తం అయింది. క్రికెటు అభిమానులు నిరాశ, నిరుత్సాహం సొమ్ము చేసుకోవడంలో బ్లాక్ మార్కెటర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో పోటీ పడ్డారు.

నేడు ప్రాక్టీసు మ్యాచ్

శని వారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంగ్లండ్ జట్టు ప్రాక్టీస్ చేస్తుంది. తదుపరి సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు భారత్ జట్టు ప్రాక్టీస్ చేస్తుంది.

జగత్ జననీ మందిర హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయాన్ని లెక్కిస్తున్న ట్రస్టు సభ్యులు

జయపురం: జయపురం ప్రజల ఆరాధ్య దేవత, మా జగత్‌జననీ దేవి ఆలయ హుండీలో భక్తులు వేసిన దక్షణలు గురువారం లెక్కించారు. గత ఏడాదిలో జగత్ జననీ మాతకు భక్తితో హుండీలో భక్తులు వేసిన డబ్బులు లెక్కించగా 12 లక్షల 42 వేల 870 రూపాయల నగదుతో పాటు దాదాపు 30 గ్రాముల వెండి వస్తువులతో పాటు సుమారు రూ. రెండు లక్షల చిల్లర డబ్బులు, చెక్‌లు, రెండు వేల రూపాయి కాయిన్స్, ఏడు రూపాయి నోట్లు వచ్చినట్లు ఆలయ ట్రస్టు వర్గాల ద్వారా తెలిసింది. హుండీలో ఉన్న డబ్బును ఆలయ బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు ట్రస్టు వర్గాలు వెల్లడించాయి. లెక్కింపు ప్రక్రియలో ఆలయ ట్రస్టు అధ్యక్షులు కె.లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు రామారావు, కార్యదర్శి మాధవ మహంకుడొ, సహాయ కార్యదర్శి మాధవ రథ్, కోశాధికారి శివ పట్నాయక్, సలహాదారు సుధీర్ త్రిపాఠీ, లక్ష్మణ నాయిక్, తపన కుమార్ మిశ్ర, బిశ్వజిత్ దండసేన, రాము బెహర, హరి పాయిక్ పాల్గొన్నారు.

'పీఎంజే'లో సరికొత్త వజ్రాభరణాలు



నూతన షోరూమ్‌లో బిజినెస్ హెడ్ హైదర్‌అలీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఫైన్ జ్యూయలరీ బ్రాండ్‌పీఎంజే జ్యువెల్స్ అని ఆమదాలవలస ఎమ్మెల్యే సతీమణి కూన ప్రమీల అన్నారు. శ్రీకాకుళం జీటీ రోడ్డులో ఏర్పాటు చేసిన పీఎంజే నూతన జ్యూయలరీ షాపును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఆంధ్రప్రదేశ్ బిజినెస్ హెడ్ హైదర్ అలీ, వైజాగ్ క్లస్టర్ డైరెక్టర్ ఆనంద్ జిలగం మాట్లాడుతూ నాణ్యతకు, నమ్మకానికి అనువైన షాపు పీఎంజే అని చెప్పారు. సిక్కోలు ప్రజల అభిరుచులకు తగినట్లుగా అన్ని రకాల ఆభరణాలు అందుబాటులో ఉంచామన్నారు. వజ్రాలు, బంగారం విలువైన స్టోన్స్‌తో కూడిన విస్తృత డిజైన్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వివాహాది, శుభకార్యాలకు, వేడుకలకు అనువైన తేలికపాటి క్రియేషన్లు కూడా స్టోర్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో సరికొత్త డిజైన్లను చూసేందుకు నగరవాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నేటి నుంచి బొరివంకలో అంతర్రాష్ట్ర నాటక పోటీలు

కవిటి: మండలంలోని బొరివంకలో శనివారం నుంచి అంతరాష్ట్ర నాటక పరిషత్ పోటీలు ప్రారంభం కానున్నాయి. కళింగ సీమ కళాపీఠం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొదటి నాటక పరిషత్ పోటీల్లో శనివారం రాత్రి 7 గంటలకు గుంటూరు జిల్లా కొలకలూరుకు చెందిన సాయి ఆర్ట్స్ వారి 'జనరల్ బోగీలు' అనే నాటిక ప్రదర్శన ఉంటుంది. 9 గంటలకు రెండో ప్రదర్శనగా 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' అనే నాటిక ప్రదర్శిస్తారు. జిల్లా నలుమూలల నుంచి కళాభిమానులు, కళాకారులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాల్ని విజయవంతం చేయాలని సంస్థ అధ్యక్షుడు బల్లెడ లక్ష్మణమూర్తి కోరారు.

నేడు సుభద్ర పథకం నాలుగో విడత నిధులు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన మహిళ ఆకర్షిత పథకంగా పేరొందిన సుభద్ర పథకం తొలి వాయిదా నాలుగో విడత నిధులను శని వారం విడుదల చేస్తున్నారు. ఈ విడతలో సుమారు 18 లక్షలకు పైగా మహిళలు మొదటి విడతగా రూ.5,000 అందుకోనున్నట్లు ఉప ముఖ్యమంత్రి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ప్రభాతి పరిడా శుక్ర వారం తెలిపారు. ముందస్తు ప్రకటన ప్రకారం నాలుగో విడత విడుదల చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీంతో రాష్ట్రంలో సుభద్ర పథకం లబ్ధిదారుల సంఖ్య సమగ్రంగా 98 లక్షలకు పెరుగుతుంది. వాస్తవానికి పలు సాంకేతిక ఇబ్బందులు కారణంగా కొంతమంది దరఖాస్తుదారులకు సుభద్ర పథకం కింద నిధులను విడుదల చేయడంలో అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ సూచనల మేరకు ఈ అవాంతరాలు అధిగమించిన వారికి ఈ విడతలో తొలి వాయిదా మొత్తం విడుదల అవుతుంది. ఈ నేపథ్యంలో శనివారం కొత్తగా 68,000 మంది లబ్ధిదారుల బ్యాంకుల ఖాతాలకు నగదు ప్రత్యక్షంగా బదిలీ అవుతుందన్నారు. దరఖాస్తు దాఖలు సవరణకు తగిన సవరణల కోసం మరో నెల గడువు పొడిగించినట్లు మంత్రి ప్రకటించారు.

విద్యార్థిని ఢీకొట్టి.. అధ్యాపకుడిని బెదిరించి!

- శ్రీకాకుళం నగరంలో శృతిమించిన ఆకతాయిల ఆకడాలు



యువకులు వినియోగించిన ద్విచక్ర వాహనం

శ్రీకాకుళం: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో శ్రీచైతన్య కాలేజీ వద్ద ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కాలేజీ ప్రారంభం విడిచిపెట్టే సమయాల్లో ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై చేరుకుని విద్యార్థులను ఈవిటీజింగ్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తూ భయపెడుతున్నారు. శుక్రవారం కాలేజీ విడిచిపెట్టే సమయానికి బైక్‌పై ముగ్గురు యువకులు కాలేజీ వద్దకు చేరుకుని ఓ విద్యార్థినిని ఢీకొట్టారు. దీంతో ఆమెకు స్వల్పంగా గాయాలయ్యాయి. రోదిస్తున్న విద్యార్థినిని చూసి అదే కాలేజీకి చెందిన ఓ అధ్యాపకుడు ఏమైందని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు బాధ్యులైన యువకులు అధ్యాపకుడిని సైతం బెదిరించారు. పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

బాలల సంరక్షణపై దృష్టిపెట్టాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాలల సంరక్షణకు స్నేహ పూర్వక వాతావరణం కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని ఆస్పత్రిలో శుక్రవారం సిబ్బ ంది బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగల షాపులో చోరీ

- 30 కేజీల వెండి వస్తువులు మాయం
- 20 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదును పట్టుకెళ్లిన దండగులు



చోరీకి గురైన బంగారం షాపు వద్ద గుమిగూడిన జనం



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం ప్రధాన వీధిలో అయ్యప్ప జ్యూయలరీ షాపులో దొంగలు పడ్డారు. గురువారం అర్ధరాత్రి ముసుగులు ధరించి మారణాయుధాలతో వచ్చిన దుండగులు 30 కేజీల వెండి వస్తువులు, 20 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 వేలు నగదు చోరీ చేసినట్లు షాపు యజమాని అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు సీసీ పుటేజీల్లో దుండగుల కదలికలు రికార్డయ్యాయి. ఐదు నుంచి ఏడుగురు వ్యక్తులు కత్తులు చేతపట్టి ద్విచక్ర వాహనాలపై వచ్చి ఈ చోరీకి పాల్పడినట్లు సమాచారం.

20 ఏళ్లుగా వ్యాపారం..

బెజ్జిపురం వద్ద కలిశెట్టిగూడెంకు చెందిన కళిశెట్టి అప్పలనాయుడు నరసన్నపేటలో నివాసముంటూ ఉర్లాంలో 20 ఏళ్లుగా బంగారం షాపు నిర్వహిస్తున్నారు. ఇటీవలే షాపును పునర్నిర్మించి గ్రిల్స్, షట్టర్లు పటిష్టం చేశారు. ఎప్పటిలాగే గురువారం రాత్రి దుకాణం క్లోజ్ చేసుకొని ఇంటికి వచ్చేశారు. శుక్ర వారం ఉదయానికి సమీపంలోని టిఫిన్ సెంటర్ నిర్వాహకులు బంగారం షాపు గ్రిల్స్ తొలగించి ఉండటం, షట్టర్ ఎత్తి ఉండటంతో అప్పలనాయుడుకు సమాచారం ఇచ్చారు. ఆయన షాపు వద్దకు చేరుకుని దొంగలు పడ్డారని గుర్తించి పోలీసులకు విషయం చెప్పారు. వెంటనే సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌లు షాపును పరిశీలించి క్లూస్ టీమ్‌ను రప్పించారు. దొంగల వేలిముద్రలు సేకరించారు. శ్రీకాకుళం సీసీఎఫ్ పోలీసు బృందం వచ్చి ఆధారాలు సేకరించారు.

లాకర్ తెరిచేందుకు విశ్వప్రయత్నం..

షాపులో పురాతన లాకర్ ఒకటి ఉంది. షాపు క్లోజ్ చేసే ముందు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు ఇందులోనే పెట్టి తాళాలు వేస్తుంటారు. దీంట్లో భాగంగా గురువారం కూడా అలాగే చేశారు. ఈ లాకర్‌ను తెరిచేందుకు దొంగలు విశ్వ ప్రయత్నం చేశారు. అయినా తెరుచుకోకపోవడంతో చోరీ సొత్తు కొంత తగ్గింది. లాకర్‌లో రెండు కేజీలకు పైగా బంగారు ఆభరణాలు, పెద్ద ఎత్తున వెండి ఉన్నట్లు సమాచారం. కాగా దొంగలు షాపు వెనుక భాగం నుంచి వచ్చి చుట్టూ ఉన్న 20 తాళాలను విరగ్గొట్టారు. షాపు మెయిన్ షట్టర్ కొంత వరకూ ఎత్తి లోపలకు వెళ్లారు. వెంటనే సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. టీవీని సైతం ఎత్తుకుపోయారు. అయితే సీసీ ఫుటేజీ స్టోరేజి యూనిట్‌ను గుర్తించక అక్కడే వదిలేశారు. ఇవన్నీ అందులో రికార్డయ్యాయి. ఈ చోరీ అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనే అని పోలీసులు అనుమానిస్తున్నారు. యజమాని అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, 25 కేజీలు వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు.

బ్లాక్ మార్కెట్‌లో వన్డే మ్యాచ్ టిక్కెట్లు



నిందితుల నుంచి జప్తు చేసిన నగదు



అక్రమార్కుల నుంచి స్వాధీనపరచుకున్న టికెట్లు, మెబైలు ఫోన్లు

భువనేశ్వర్: కటక్ బారాబటి స్టేడియంలో జరగనున్న భారత్, ఇంగ్లండ్ వన్డే మ్యాచ్ టికెట్ల బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతున్నాయి. ఈ అక్రమ వ్యవహారానికి సంబంధించి 2 ఠాణాల్లో వేర్వేరు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా 7 మంది నిందితుల్ని అరెస్టు చేశారు. కటక్ దర్గా బజార్ ఠాణా, కంటోన్మెంట్ ఠాణాలో వేర్వేరుగా దాఖలైన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా నిందితుల్ని అరెస్టు చేసి విచారణ చేశారు. కటక్ దర్గా బజార్ ఠాణాలో దాఖలైన ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఈర్) ఆధారంగా పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి దగ్గర నుంచి 8 టికెట్లు, రూ. 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కంటోన్మెంట్ ఠాణాలో దాఖలైన 3 ప్రాథమిక సమాచార నివేదికల ఆధారంగా మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి దగ్గర నుంచి 17 టికెట్లు, 3 మొబైలు ఫోన్లు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. శుక్ర వారం జరిగిన డీల్‌లో సాదాసీదా దుస్తుల్లో ఉన్న పోలీసులకు అక్రమార్కులు చిక్కారు. ప్రాథమిక సమాచారం ప్రకారం రూ.700 టిక్కెట్లను 3 వేల రూపాయలకు, రూ. 1,100 టిక్కెట్లను 5 నుంచి 10 వేల రూపాయలకు అక్రమంగా విక్రయించారు. ఈ వ్యవహారంలో 7 మంది నిందితుల్ని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

జయపురంలో ఉచిత వైద్య శిబిరం



ఉషా ఆస్పత్రి సిబ్బందిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

- 155 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది



బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జయపురం: జిల్లా బార్ అసోసియేషన్ జయపురం వారు స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఉషా ఆస్పత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన శిబిరాన్ని జిల్లా జడ్జి ప్రదీప్ కుమార్ మహాపాత్రో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరం నిర్వహకులను అభినందించారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాల ద్వారా సామాన్య ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. శిబిరానికి వచ్చిన వారికి ఈసీజీ, రక్తపోటు, మధుమేహ పరీక్షలతో పాటు అన్ని వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేసి వాటిని వినియోగించే విదానాన్ని వివరించారు. 155 మందికి వైద్య పరీక్షలు చేశారు. జిల్లా బార్ అసోసియేషన్ జయపురం అధ్యక్షులు త్రినాథ్ మున్నాసింగ్ లాల్‌తో పాటు బార్ సభ్యులు శిబిరాన్ని పర్యవేక్షించారు. న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది వైద్య పరీక్షలు జరుపుకున్నారు. ఉషా ఆస్పత్రి డాక్టర్ వెంకటరావు నేతృత్వంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బందిని బార్ అసోసియేషన్ అధ్యక్షులు త్రినాథ్ మున్నా సింగ్‌లాల్ సత్కరించారు.

టికెట్ తనిఖీ సిబ్బంది విశ్రాంతి గదిలో చోరీ



విశ్రాంత గదిలోకి చొరబడుతున్న దొంగ

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలం ప్రధాన కార్యాలయం రైల్వే స్టేషన్‌లో టికెటు తనిఖీ సిబ్బంది మొబైలు ఫోన్ చోరీ జరిగింది. ఖుర్దారోడ్ రైల్వే స్టేషను సముదాయం తొలి అంతస్తుపై ఉన్న టికెటు తనిఖీ సిబ్బంది విశ్రాంతి గదిలో ఈ సంఘటన సంభవించింది. విశాఖపట్నం మండలం సిబ్బది విశ్రాంతి తీసుకునే గదిలో మొబైలు ఫోన్ల చోరీ జరిగింది. నలుగురు టికెట్ తనిఖీ సిబ్బంది మొబైలు ఫోన్లు దొంగిలించారు. ఈ సంఘటనపై సిబ్బంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విశ్రాంత గదుల్లో మౌలిక రక్షణ సౌకర్యాలు కొరవడడం విచారకరమని పేర్కొన్నారు. ఈ మేరకు విశ్రాంతి గదుల్లో సిబ్బంది రక్షణ, భద్రత పట్ల అనుబంధ విభాగాల ఉన్నతాధికారులు సత్వర కార్యాచరణ చేపట్టాలని అభ్యర్థించారు. అఖిల భారత టికెటు తనిఖీ సిబ్బంది సంఘం (ఐఆర్‌టీసీఎస్ఓ) అధికార వర్గాలతో సంప్రదించి సత్వర కార్యాచరణతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బాధిత వర్గం స్థానిక ప్రభుత్వ రైల్వే పోలీసు జీఆర్పీకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి జీఆర్పీ దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దొంగని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తిరువీధి



శాలిహుండం సమీపంలో లక్ష్మీనృసింహస్వామి తిరువీధి



పోలీసులకు సూచనలిస్తున్న సీఐ పైడపునాయుడు

గార: శాలిహుండం కొండ దిగువనున్న లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. గిరియాత్రలో భాగంగా ముందుగా స్వామి ఉత్సవ మూర్తులను శాలిహుండం, కొత్తపేట, బోరవానిపేట, తంగుళ్లపేట తదితర గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త సుగ్గు మధురెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని హారతులు పట్టారు. శనివారం ఉదయం వంశధార నదిలో చక్ర తీర్థ స్నానం, కొండపైన దర్శనాలు ఉండటంతో పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఇప్పటికే కొండవద్దకు దూరప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు చేరుకున్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కొండపై, కిందన పాఠశాల ఆవరణలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు సిద్ధం చేశారు.

కనులపండువగా క్షీరాభిషేకం

శాలిహుండం కాళీయ మర్ధన వేణుగోపాలస్వామికి శుక్రవారం రాత్రి 12 గంటల తర్వాత భీష్మ ఏకాదశి సందర్భంగా క్షీరాభిషేకం కనుల పండువుగా జరిగింది. ఆలయ ట్రస్టీ సుగ్గు మధురెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, పూజాసామగ్రిని స్వామికి సమర్పించగా, భక్తులు తెచ్చిన పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు వివిధ తీర్థ జలాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

క్లుప్తంగా

బియ్యం లారీ బోల్తా



ప్రమాదంలో బోల్తా పడిన బియ్యం లారీ

బొండపల్లి: వేగంగా వస్తున్న బియ్యం లారీ అదుపు తప్పి బోల్తా పడి పొలాల్లోకి దూసుకు వెళ్లింది. బొండపల్లి మండలంలోని నెలివాడ గ్రామం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారి26పై ఈ ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రాయ్‌పూర్ నుంచి కాకినాడకు ఉప్పుడు బియ్యంతో వెళ్తున్న లారీ వేగంగా వస్తూ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకుని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో హైవే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గుర్తించి క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాప్రాయ పరిస్థితి లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల ఐరన్ జోడుతో వెళ్తున్న లారీ ఒక్కటి అదే ప్రాంతంలో ప్రమాదానికి గురి కావడంతో పాటు తరచూ అదే ప్రాంతంలో పలు రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు అక్కడికి వచ్చేసరికి తీవ్ర భయాందోళనకు గుర వుతున్నారు.

సాయిబాబా గుడిలో వెండి వస్తువుల చోరీ



షిర్డీ సాయిబాబా మందిరం

లక్కవరపుకోట: మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్‌లో గురువారం రాత్రి దొంగలు అలజడి సృష్టించారు. జంక్షన్‌లో గల కొన్ని షాపుల తాళాలు విరగొట్టేందుకు విఫలయత్నం చేశారు. అలాగే జంక్షన్‌లో గల షిర్డీ సాయిబాబా ఆలయంలో ఇనుపగేట్ల తాళాలను విరగ్గొట్టి దొంగలు లోనికి ప్రవేశించి స్వామివారి కిరీటం, మకరతోరణం, హారతి ఇచ్చే పళ్లెం తదితర వెండి వస్తువులు సుమారు 2 కేజీలు చోరీచేసినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో స్వామివారి అలంకరణకు ఉపయోగించే వస్తువులు విలువైనవి పట్టుకుపోయి, మరికొన్ని ఆలయం వెనుకవైపు పడేసి ఆక్కడినుంచి దొంగలు జారుకున్నారు. ఉదయం ఎప్పటిలాగే పూజారి వచ్చి తలుపులు తీసేందుకు చూడగా తాళాలు విరగొట్టి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. విజయనగరం నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ వేలిముద్రలను సేకరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిరంతరం పనులు కొనసాగిస్తాం

- జిల్లా ఆర్అండ్‌బీ శాఖ

బొబ్బిలిరూరల్: ఒడిశా, ఆంధ్రా రాష్ట్రాల మధ్య వాహనాల రాకపోకలకు కీలకమైన పారాది గ్రామం వద్ద వేగావతి నదిపై చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణం పనులపై గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'పారాది ముందుకు కదలదా' కథనంపై ఆర్అండ్‌బీ జిల్లా శాఖ సందించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. నిరంతరం బ్రిడ్జిపనులను చేపడుతున్నామని, నిర్దేశిత సమయానికి పనులను పూర్తిచేస్తామని పేర్కొంది.

వ్యక్తి అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలో సతివాడ గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై బి. గణేష్ తెలిపారు. మద్యం విక్రయాలపై అందిన సమాచారం మేరకు దాడులు చేపట్టగా నిందితుడి వద్ద 12 మద్యం సీసాలు లభించాయన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గురుకులం విద్యార్థులకు మలేరియా



నెల్లిమర్ల సాంఘిక సంక్షేమ గురుకులం

నెల్లిమర్ల: పట్టణంలోని వేణుగోపాలపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మలేరియా జ్వరం బారిన పడ్డారు. ప్రస్తుతం ఇద్దరు విద్యార్థులూ విశాఖపట్నంలోని కేజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొందరు సాధారణ జ్వరాలతో బాధపడుతున్నారు. జరజాపుపేట అర్బన్ పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. పరీక్షల నిమిత్తం 200 మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరించారు. పాఠశాల ప్రహరీ ముందున్న గొయ్యిలో పెద్ద ఎత్తున మురుగు నీరు నిల్వ ఉండడం, దోమలు ఎక్కువగా పెరగడంతో విద్యార్థులు జ్వరాల బారిన పడినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. మలేరియా బారిన పడిన విద్యార్థులు కోలుకున్నారని ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు.

రారండోయ్.. రామయ్య కల్యాణం చూద్దాం..!

- నేడు రామతీర్థంలో సీతారాముల తిరుక్కల్యాణ మహోత్సవం
- హంస, అశ్వ, గరుడ వాహనాలపై ఊరేగనున్న స్వామివారు
- సజావుగా జరిగేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం అధికారులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో వెలసిన శ్రీ సీతారామస్వామి వారి తిరుక్కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి కనుల పండువగా జరగనుంది. పవిత్ర దినమైన భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు గాను దేవస్థానం అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం జరిగిన స్వామివారి పందిరి రాట మహోత్సవం నుంచే రామతీర్థం అంతా కల్యాణ శోభ సంతరించుకుంది. గడిచిన నాలుగు రోజుల నుంచి రామక్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి



సిద్ధమైన రామతీర్థం దేవస్థానం

సీతారామచంద్ర ప్రభువుల వారిని, అలాగే తూర్పు రాజగోపురం వద్ద వేసిన స్వామివారి పందిరిరాటను అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు.

కనులారా తిలకిస్తే ఎంతో భాగ్యం..

వేకువజామునుంచే ఆలయంలో కల్యాణ మహోత్సవ పూజలు ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం యాగశాలలో విశేష హోమాలను జరిపించిన తరువాత స్వామివారి సన్నిధిలో శ్రీమద్రామాయణ పారాయణం, వేదపఠనం నిర్వహించనున్నారు. పూసపాటిరేగ మండలంలోని కుమిలి గ్రామానికి చెందిన ఏకుల వంశీయులు ఎప్పటిలాగే సీతమ్మ వారి తరపున కల్యాణ వేడుకకు హాజరై స్వామివారికి పూజా ద్రవ్యాలను సమర్పించనున్నారు. పట్టు వస్త్రాలతో సీతారామస్వామివారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. నాదస్వర కచేరీ నిర్వహించిన తరువాత స్వామివారి ఉత్సవ విగ్రహాలను హంస, అశ్వ, గరుడ వాహనాలపై రామతీర్థం పురవీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఊరేగింపులోనే సీతా రాముల ఎదురు సన్నాహం నిర్వహిస్తారు. అనంతరం ఆ ఉత్సవ విగ్రహాలను కల్యాణ మంటపంలోనికి తీసుకువచ్చి రాత్రి 10 గంటలకు అశేష భక్తజనం నడుమ స్వామివారి తిరుక్కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపిస్తారు. అనంతరం ఆరగింపు, మంగళాశాసనం జరిపిస్తారు.




స్వామివారి ఉత్సవ విగ్రహాలు



ఎదురు సన్నాహ మహోత్సవానికి సిద్ధమైన మూడు వాహనాలు

సకల శుభాలను అందించగలిగేదే కల్యాణోత్సవం



మానవుడికి సకల శుభాలను అందించగలిగే శక్తి స్వామివారి కల్యాణోత్సవానికి ఉంది. అందుకే ఏ ఉత్సవాల్లో అయినా కల్యాణోత్సవం ప్రధానమైన ఘట్టం. రామతీర్థంలో రామస్వామి వారి దేవాలయం ప్రతిష్టాపన జరిగిన రోజున ఏటా ఈ తిరుక్కల్యాణ మహోత్సవాన్ని జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు మూలాధారాలు దేవాలయాలు. దేవాలయంలో జరిపించే ఉత్సవ, ఆరాధనలు, కల్యాణోత్సవాలు లోక కల్యాణం కోసమే నిర్వహిస్తుంటారు. సామాన్యుడు సైతం నిర్వహించుకోగలిగిన మహాయజ్ఞం స్వామివారి కల్యాణోత్సవమే.

సాయిరామాచార్యులు, అర్చకుడు, రామతీర్థం దేవస్థానం

ఏర్పాట్లు పూర్తి చేశాం:



రామస్వామి వారి తిరుక్కల్యాణ మహోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. స్వామివారి కల్యాణానికి సీతమ్మవారి తరపున ఏటా పూజా ద్రవ్యాలను సమర్పిస్తున్న పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామానికి చెందిన ఏకుల వంశీయులకు కల్యాణ కబురు ఇప్పటికే పంపించాం. కల్యాణం సజావుగా సాగేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు తెలియజేశాం. కల్యాణోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశాం.

శ్రీనివాసరావు, ఈఓ, రామతీర్థం దేవస్థానం

బందోబస్తు నిర్వహిస్తున్నాం..



రామతీర్థంలో తిరుక్కల్యాణ మహోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సేవలతో కూడిన ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో సుమారు 30 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు కొనసాగుతుంది. ఇప్పటికే దేవస్థానం అధికారులతో బందోబస్తు అంశంపై చర్చించాం. స్వామివారి కల్యాణం సజావుగా సాగేందుకు భక్తులు కూడా సహకరించాలి.

గణేష్, ఎస్సై, నెల్లిమర్ల మండలం

సీనియర్స్ బాక్సింగ్ మహిళల పోటీలకు 10 మంది ఎంపిక

- ఈ నెల 11,12న విశాఖ వేదికగా పోటీల నిర్వహణ

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ మహిళల బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధమైంది. ఈ నెల 11,12 తేదీల్లో విశాఖ వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి 8వ మహిళల సీనియర్స్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు శుక్రవారం స్థానిక రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో గల బాక్సింగ్ హాల్లో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పదిమంది క్రీడాకరులను వివిధ కేటగిరీల్లో ఎంపిక చేసినట్లు ఎంపిక పోటీలను ప్రారంభించిన అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథ కుమార్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న అంతర్ జిల్లాల మహిళల బాక్సింగ్ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, సెక్రటరీ ఇందుకూరి అశోక్ రాజు, ఎస్. ఈ రాజు, రాకేష్ కుమార్, కె.సూర్యవర్ధన్ రెడ్డి, వి.మల్లేష్, బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు, బాక్సింగ్ రింగ్ అఫిషియల్స్ వి.సంతోష్ కుమార్, పి. శ్రీనివాస రావు, కర్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో నైపుణ్యాభివృద్ధి సంస్థలో శిక్షణ పొందిన మహిళలంతా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేద్కర్ అన్నారు. శిక్షణలో సాధించిన నైపుణ్యంతో మీరు ఉపాధి పొందుతూ మరో ముగ్గురికైనా ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 15 ట్రేడ్‌లలో శిక్షణ పొందిన 30 మంది యువ మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనిట్ల స్థాపనకు ఎటువంటి పూచీకత్తు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలను అందజేయనున్నామని, ఎవరికి ఏ రంగంలో ఆసక్తి ఉంటే ఆ రంగంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రమణమూర్తి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన కింద రుణాలు

పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద జిల్లాలో 307 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరైనట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్‌లో పీఎం విశ్వకర్మ యోజన పథకంపై సమీక్షించారు. 777 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీలకు చెందిన సచివాలయాలకు 86,225 దరఖాస్తులు అందగా ప్రభుత్వం నుంచి 16,330 మందికి రుణాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్‌కుమార్, ఎల్‌డీఎం రమణమూర్తి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, ఇండస్ట్రియల్ ప్రమోహన్ అధికారి శశికళ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ట్రేడ్ శిక్షణ సర్టిఫికెట్లు అందచేస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

విద్యార్థి అదృశ్యం



అమలాపురం మణికంఠ

తెర్లాం: మండలంలోని నందబలగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి తెర్లాం ఎస్సై సాగర్‌బాబు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నందబలగ గ్రామానికి చెందిన అమలాపురం చంటి, సంధ్యల కుమారుడు మణికంఠ. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లి అక్కడ మధ్యాహ్న భోజనం చేసి ఎటో వెళ్లిపోయాడు. ఆ రాత్రి ఇంటికి రాకపోవడంతో విద్యార్థి కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాలు, గ్రామాల్లో గాలించారు. మణికంఠ తల్లిదండ్రులు కూలి పనుల నిమిత్తం రాజమండ్రిలో ఉంటుండగా వారి వద్దకు వెళ్లాడమోనని అతని చిన్నాన్న వాకబు చేయగా అక్కడికీ రాలేదని తెలిసింది. మూడు రోజులైనా ఇంటికి రాకపోవడం, విద్యార్థి ఆచూకీ లభించకపోవడంతో అతని చిన్నాన్న చినరాయుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9666005926, 9642197182 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబసభ్యులు కోరారు.

చెరువు వద్ద గంజాయి ప్యాకెట్లు

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామ సమీపంలోని చెరువు వద్ద రెండు రోజుల క్రితం గంజాయి పట్టుబడినట్లు ఎస్సై బి.దేవి శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాటూరు సమీపంలో రాజుచెరువు వద్ద గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెళ్లి పరిశీలించి 10కేజీల942 గ్రాముల గంజాయి ప్యాకెట్లను గుర్తించామన్నారు. గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

రెండోరోజు రైల్వే పనుల అడ్డగింత

- బాధితుల డిమాండ్లను ఒప్పుకున్న అధికారులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం వద్ద రైల్వే మూడోలైన్ ఏర్పాటుకు 40 ఇళ్లు కోల్పోయిన బాధితులు తగిన నష్టపరిహారం డిమాండ్లు తీర్చకపోవడంతో రైల్వే పనులను రెండోరోజు శుక్రవారం అడ్డుకున్నారు. ఎలాగైనా పనులు చేపట్టాలని అధికారులు భారీగా పోలీసు బలగాలను మోహరించినప్పటికీ గ్రామస్తులు ఎదురు తిరగడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దార్ విజయ భాస్కర్ బాధితులతో చర్చలు జరిపారు. బాధితుల కోరిక మేరకు వందరోజుల్లో ఇళ్లస్థలాలు ఇవ్వడానికి, ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే ఇల్లు కట్టించి ఇవ్వడానికి అధికారులు ఒప్పుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రౌతురాజేశ్వరి, గజపతినగరం సీఐ రమణ, ఎస్సైలు జయంతి, రాజేష్, మహేష్ , లక్ష్మణరావు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయభాస్కర్, సీఐ రమణ

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే 'వెల్ఫేర్ డే'

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్‌డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది సమస్యలు ఆయన తెలుసుకున్నారు. వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన ఎస్పీ వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను స్వయంగా నోట్ చేసుకుని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి చేయూతనందించేందుకు హోంగార్డు సిబ్బంది పోగు చేసిన ఒక్కరోజు డ్యూటీ అలవెన్స్ చెక్‌ను ఎస్పీ వకుల్ జిందల్ మృతుడి కుటుంబసభ్యులకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో పనిచేస్తూ మృతిచెందిన బి.జగదీశ్వరరావు కుటుంబానికి హోంగార్డులు ఒకరోజు డ్యూటీ అలవెన్స్ రూ.3 లక్షల 25 వేల 890 చెక్‌ను అతని తల్లి బి.హైమావతికి ఎస్పీ అందజేశామని చెప్పారు. కుటుంబ సభ్యుల్లో ఒకరిని హోంగార్డుగా నియమించేందుకు కుటుంబ సంక్షేమానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ ఇన్చార్జ్ ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, డీపీఓ సూపరింటెండెంట్ ఏఎస్‌వీ.ప్రభాకరరావు, పోలీసు కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డు కుటుంబసభ్యులకు చెక్ అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షల హాల్ టిక్కెట్లు సిద్ధం

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూప్స్ చదువుతున్న విద్యార్థులకు ప్రయోగ పరీక్షల హాల్ టికెట్లను కళాశాల లాగిన్ లోను, ఇంటర్మీడియట్ బోర్డ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజులవీణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను బోర్డు వెబ్‌సైట్‌లో ఆధార్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. అదేవిధంగా ఫోన్ 9552300009నంబర్‌కు వాట్సప్‌లో ఎడ్యుకేషన్ సర్వీస్ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసి అందులో గత హాల్ టికెట్ నంబర్‌ను ఎంటర్ చేసి మార్చి 2025 హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రయోగ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.



జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజులవీణ

ఆర్టీసీ బస్సులో వ్యక్తి మృతి




పల్లె వెలుగు బస్సు వద్ద మృతి చెందిన రామారావు

గజపతినగరం: మెంటాడ మండలం పెదమేడపల్లి గ్రామానికి చెందిన ఓవ్యక్తి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ మార్గమధ్యంలో మృతిచెందాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెదమేడపల్లి గ్రామానికి చెందిన మార్పిన రామారావు (57) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం మెంటాడ మండలంలోని జక్కువ నుంచి విజయనగరం వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో విజయనగరం ప్రయాణిస్తుండగా గజపతినగరం మండలం మధుపాడ గ్రామం వచ్చేసరికి మృతిచెందాడు.

పాముకాటుతో వ్యక్తి..

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లి గ్రామానికి చెందిన గోగాడ రమణ(53) పాముకాటుకు గురై విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. రమణ గ్రామంలో తన పంట పొలంలో నుయ్యి వద్ద నీటి ఇంజిన్‌తో వేరుశనగ పంటకు గురువారం రాత్రి నీటిని తోడుతుండగా పొలంలో పాముకాటుకు గురయ్యాడు. వెంటనే స్థానికులు ఎల్.కోట పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మరణించినట్లు చెప్పారు. మృతుడి భార్య మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు



బొప్పడాం జంక్షన్‌లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల రూరల్: నేరాల నియంత్రణకు మండల వ్యాప్తంగా వివిధ ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎస్సై బి. గణేష్ తెలిపారు. మండలంలోని బొప్పడాం, పారసాం జంక్షన్లలో వివిధ షాపుల యజమానుల భాగస్వామ్యంతో శుక్రవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్, ఇతర క్రైమ్ కేసుల ఛేదనలో కెమెరాలు ఎంతగానో సహకరిస్తాయన్నారు. మండలంలోని అన్ని ప్రధాన జంక్షన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని షాపుల యజమానులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

తోటపల్లిలో ఆధ్యాత్మిక సందడి



ఆలయం వద్ద ధ్వజ స్తంభం ఏర్పాటు

గరుగుబిల్లి: తోటపల్లిలో ఆధ్యాత్మిక సందడి నెలకుంది. స్వయం భూ శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పురుష సూక్త, స్త్రీ సూక్త హోమంలు, ప్రాయశ్చిత్త హోమం, యంత్ర ప్రతిష్ఠ, ధ్వజ, విగ్రహ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు పుష్పగిరి పీఠాధిపతి, జగద్గురువు విద్యాశంకర భారతీ స్వామి చేతుల మీదుగా సాగాయి. బ్రహ్మశ్రీ కొడవగంటి వెంకట నర్సింహాచార్యుల వేద మంత్రోశ్చరణల మధ్య, చతుర్వేద పారాయణములతో తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితుల సహకారంతో వైదిక మంత్ర అనుష్ఠానంలతో బ్రహ్మశ్రీ జంధ్యాల జగన్నాథశాస్త్రి పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, దేవదాయశాఖ జిల్లా అధికారి ఎస్.రాజారావుతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ, అర్చకులు వి.వి. అప్పలాచార్యులతో పాటు ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.

నేడు స్వామివారి కళ్యాణం

తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం స్వామివారి వార్షిక కల్యాణం జరిపిస్తామని ఈఓ సూర్యనారాయణ తెలిపారు. మాఘ శుద్ధ ఏకాదశి సందర్భంగా సాయంత్రం 6 గంట లకు స్వామివారి వార్షిక సామూహిక కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

ఎమ్మెల్సీ స్థానానికి ఐదో రోజు నాలుగు నామినేషన్లు

- ఇప్పటివరకు 8 నామినేషన్ల దాఖలు
- శని, ఆదివారం సెలవు, సోమవారం ఆఖరు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి శుక్రవారం మరో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటి వరకు దాఖలైన నామినేషన్ల సంఖ్య 8కి చేరింది. పీఆర్టీ యూ మద్దతుతో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, స్వతంత్ర అభ్యర్థులు నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, ఎస్టీ, ఎస్టీ బహుజన ఫోరం అభ్యర్థి పోతల దుర్గారావు తమ మద్దతుదారులతో కలిసి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్‌కు సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో కలెక్టర్ ప్రమాణం చేయించారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియకు గడువు కాగా.. ఇప్పటికే ఐదు రోజులు గడిచిపోయింది. రెండో శనివారం, ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఒక్క రోజే ఇంకా నామినేషన్లు వేయడానికి గడువు ఉంది. ఇప్పటివరకు ఎనిమిది నామినేషన్లు దాఖలవ్వగా అభ్యర్థులు 14 సెట్లు సమర్పించారు. ఏఆర్వో, డీఆర్వో భవానీ శంకర్, నోడల్ అధికారి, వీ ఎంఆర్డీఏ ఎస్టేట్ అధికారి దయానిధి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న పీఆర్టీయూ మద్దతు అభ్యర్థి గాదె శ్రీనివాసుల నాయుడు

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను శక్తి వంచన లేకుండా పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసిన తర్వాత కలెక్టరేట్ ప్రాంగణంలో శ్రీనివాసుల నాయుడు మీడియాతో మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో కీలకంగా పని చేశానన్నారు. తనకు పలు ఉపాధ్యాయుల సంఘాల మద్దతు ఉందని తెలిపారు. కాగా.. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోని ప్రైవేట్ పంక్షన్‌ హాలులో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ, మిత్ర సంఘాలు ఏపీటీఎఫ్ 1938, ఏపీ యూఎస్, ఎస్టీయూ, ఏపీటీడబ్ల్యూటీఏ, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, పీఈటీ అసోసియేషన్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏపీటీఏ), గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్, కాంట్రాక్ట్ డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్, జూనియర్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్‌లు శ్రీనివాసుల నాయుడుకు మద్దతు ప్రకటించాయి. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్ట కృష్ణయ్య, ఏఎం గిరిప్రసాద్ రెడ్డి, రాష్ట్ర స్థాయి నాయకుడు వైష్ణవ కరుణానిధి, ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎస్టీయూ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఇమంది పైడిరాజు, పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డి.గోపీనాథ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు పి.వి.ఎన్.మాధవ్ సమావేశంలో పాల్గొని.. రాజకీయాలకు అతీతంగా.. ఉపాధ్యాయుల సమస్యలపై పట్టు ఉన్న గాదె శ్రీనివాసుల నాయుడును ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఆరు జిల్లాలకు సంబంధించిన అన్ని సంఘాల అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు.